క్లుప్తంగా

తురగాకు మిలీనియం అవార్డు



మిలీనియం అవార్డు స్వీకరిస్తున్న కళాకారుడు తురగా సూర్యారావు

కాకినాడ కల్చరల్: స్థానిక కళాకారుడు, సమాజ సేవకుడు తురగా సూర్యారావుకు మిలీనియం ఆఫ్ ది ఇయర్-2023 అవార్డు ప్రదానం చేశారు. సూర్యచంద్ర కల్చరల్ అండ్ ఈవెంట్స్ అర్గనైజేషన్ యేటా రిపబ్లిక్ డే నాడు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరిస్తుంది. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తురగా కళా సేవకు గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేసినట్టు ఆర్గనైజేషన్ అధ్యక్షులు పి.మోహన్‌చంద్ర అన్నారు. నగర ప్రముఖులు, కళాకారులు తురగాను అభినందించారు

ఇష్టంతో చదువుతున్నారు



చదవడం మాకిష్టంలో విద్యార్థులకు బోధిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న గ్రంథాలయాల శాఖల్లో ఆదివారం నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం' కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోంది. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై చందమామ కథలు, అల్లాడిన్, ది ప్లాంట్ కింగ్డమ్ తదితర పుస్తకాలు అభ్యసిస్తున్నారు. గాంధీనగర్ శాఖ కార్యాలయంలో దాదాపు 200 మంది పాఠక విద్యార్థులకు గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు పుస్తకాలు అందజేసి సందేహాలు నివృత్తి చేశారు.

కృషితో లక్ష్యాల సాధన



విజేతలకు బహుమతి అందిస్తున్న గ్రూపు కమాండర్ రిషి

బోట్‌క్లబ్: కృషి ఉంటే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చునని ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ ఏకే రిషి అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం సైకాలజిస్ట్ జి.శశిభూషన్ అధ్యక్షతన కేరీర్ ఎక్స్‌పో నిర్వహించారు. పోటీ ప్రపంచంలో ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, సమయపాలన లేకుంటే అనుకున్నది సాధించలేమని అన్నారు. విద్యార్థులు కెరీర్‌పై పట్టు ఎలా సాధించాలో శశిభూషణ్ వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహించిన విజేతకు బహుమతులు అందించారు.

ఐక్యవేదిక సిటీ అధ్యక్షుడిగా కడియాల



సమావేశంలో పాల్గొన్న కమిటీ అధ్యక్షుడు కడియాల నాగరాజు తదితరులు

కాకినాడ కల్చరల్: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక సిటీ కమిటీ అధ్యక్షుడిగా కడియాల నాగరాజు ఎన్నికయ్యారు. స్థానిక గాంధీభవన్‌లో ఆదివారం కమిటీ ఎన్నిక జరిగింది. వేదిక జిల్లా కన్వీనర్ కె.సతీష్ అధ్యక్షతన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు పి.ఆదినారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.దుర్గారమేష్ సమక్షంలో ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా కడియాల నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కొప్పిరెడ్డి కామరాజు, కోశాధికారిగా కె.మహాలక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం జరిగిన సమావేశంలో సమాచార చట్టంపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు సభ్యులు కృషి చేయాలని తీర్మానించారు. జిల్లా కన్వీనర్ కె.వరలక్ష్మి, న్యాయవాది కేవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

కరప: మండలం కొంగోడులో ఒక వృద్ధుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. కొంగోడు గ్రామానికి చెందిన వాసంశెట్టి వెంకట్రావు (72) ఇంటిపెరటిలో బోర్ నుంచి మోటార్‌పైపు బిగించి, ఆకు,కూరలు పండిస్తుంటాడు. ఆదివారం మధ్యాహ్నం మొక్కలకు నీరు రాకపోవడంతో పైపులను సరిచేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో వెంకట్రావు అక్కడికక్కడే మృతి చెందాడు. నక్కా బాబులు, ఇతర గ్రామస్తులు ఘటనాస్థలానికి చేరుకుని, దూరాన ఉన్న కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

గొర్రిపూడిలో ప్రచారం

కరప: మండలం గొర్రిపూడిలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కల్సి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వారి ప్రతిభ విభిన్నం

కాకినాడ కల్చరల్: వారి మనోధైర్యం, ఆత్మవిశ్వాసం విభిన్నం. విధి వెక్కిరించినా వైకల్యాన్ని లెక్కచేయక అటు లలిత కళలు, ఇటు క్రీడల్లో తమకు సాటి ఎవరూ లేరని నిరూపిస్తున్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, క్రియ తదితర సంస్థలు ఇటీవల ఏర్పాటు చేసిన పోటీల్లో ప్రతిభ చాటి ఔరా అనిపించుకున్నారు. వారి ప్రగతి, ఆనందం వారిమాటల్లోనే..



సాంస్కృతిక ప్రదర్శనల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు



జిల్లా స్థాయి పోటీల్లో విభిన్న ప్రతిభావంతులతో ఎంపీ వంగా గీత, కలెక్టర్ కృతికా శుక్లా, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు

బహుమతి పొందడం సంతోషంగా ఉంది



నాపేరు సాత్విక్. జిల్లా స్థాయి పోటీల్లో జూనియర్స్ కేటగిరీ పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాను. ఉమావికాసకేంద్రంలో రెండో తరగతి చదువుతున్నాను. డ్యాన్స్ కూడా చేస్తాను. పాఠశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటాను. తల్లిదండ్రులు లోవకుమారి, రాజు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఇదంతా సాధిస్తున్నాను.

ఆటలంటే ఇష్టం



నాపేరు నానిపండు. మనో వికాస కేంద్రంలో ఐదో తరగతి చదువుతున్నా. ఆటలంటే, అందులో పరుగు పందెం అంటే చాలా ఇష్టం. ఇందులో సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి పొందడం సంతోషంగా ఉంది. మా పాఠశాలలో జరిగే రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవాల్లో నిర్వహించే అన్ని పోటీల్లో ఎన్నో బహుమతులు గెలుచుకున్నా.

నృత్యం అంటే ప్రాణం



నాపేరు బి.నాగలక్ష్మి. నేను మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. శాస్త్రీయ నృత్యం అంటే చాలా ఇష్టం. క్రియ పిల్లల పండుగ రాష్ట్రస్థాయి పోటీల్లో జానపద నృత్యం చేసి ప్రశంసాపత్రం పొందడం ఆనందాన్నిచ్చింది. ఒకటో తరగతి నుంచి ఆశ్రమ పాఠశాలలోనే ఉంటున్నాను. మంచి నర్తకిగా గుర్తింపు పొంది అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇవ్వాలన్నదే లక్ష్యం.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



నాపేరు పి.మహేశ్వరి, మహర్షి సాంబమూర్తి వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. ఆటలు అంటే ఇష్టం. జిల్లా స్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో ప్రథమ బహుమతి పొందడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నా ఆశయం. ఉపాధ్యాయులు మంచి ప్రోత్సాహం ఇస్తున్నారు.

పరిశుభ్రతే దేశ ప్రగతికి సోపానం



హోప్‌ఐలాండ్‌ను శుభ్రం చేస్తున్న అధికారులు

బోట్‌క్లబ్: పరిశుభ్రతే ప్రగతికి సోపానమని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాదు నరసింహారెడ్డి అన్నారు. కస్టమ్స్ యాక్ట్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వచ్ఛ పక్వాడలో భాగంగా కాకినాడ కస్టమ్ హౌస్ ఆధ్వర్యంలో కాకినాడ సీపోర్టు లిమిటెడ్, పోర్టు డిపార్టుమెంట్, అటవీశాఖ, ఆల్ ఈజీవెల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హోప్ ఐలాండ్‌లో పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. వ్యర్థాలను కాకినాడ నగరపాలకసంస్థ డంపింగ్ యార్డుకు తరలించారు. సీపోర్టు లిమిటెడ్ సీఈఓ మురళీధర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ బీచ్‌ను రెండేళ్లు దత్తత తీసుకుని ఆరుగురు సిబ్బందితో నిత్యం శుభ్రం చేస్తున్నట్టు తెలిపారు. పోర్టు అధికారి శ్రీధర్మశాస్త్ర, ట్రస్ట్ హాస్పిటల్ ఎండీ రామకృష్ణ, కస్టమ్స్ సూపరింటెండెంట్లు, ఆల్‌ఈజీవెల్ సభ్యులు పాల్గొన్నారు.

భావనారాయణుని ఆలయంలో మాఘ సందడి

- స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కురసాల
- ఏర్పాట్లు పరిశీలించి ఈఓకు సూచనలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరంలో రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం నుంచి మాఘ సందడి ప్రారంభమైంది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పొంగలి నైవేద్యం పెట్టారు. తొలిరోజు స్వామివారిని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దర్శించుకుని ఆలయంలో ఏర్పాట్లను, అన్న సంతర్పణను పరిశీలించి ఈఓ విజయలక్ష్మికి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కురసాల కళ్యాణ కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో పాటు ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, హితకారిణి సమాజ డైరెక్టరు అరుణ, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జమ్మలమడక నాగమణి తదితరులు పాల్గొన్నారు.



పురందరదాసు కీర్తనలు ఆలపిస్తున్న శ్రీలక్ష్మి మహావిష్ణు భజన మండలి సభ్యులు

అలరించిన పురందర దాసు కీర్తనలు

కాకినాడ కల్చరల్: స్థానిక సర్పవరం నారదకుండం వాగ్గేయకార మండపంలో పురందరదాసు ఆరాధనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆధ్వర్యంలో పెద్దాపురానికి చెందిన శ్రీలక్ష్మి మహావిష్ణు భజన మండలి ఈ కీర్తనలు గానం చేశారు. కర్ణాటక సంగీత పితామహుడు పురందర దాసు అని సూర్యకుమారి అన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సంగీత విద్వాంసులు, శిష్యులు, భక్తులు హాజరయ్యారు.

భానులింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: మాఘ ఆదివారం సందర్భంగా స్థానిక భానుగుడి భానులింగేశ్వర ఆలయ ప్రాంగణంలో సూర్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటల నుంచి స్వామికి పంచామృత అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని సర్వాంగం సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు.

ఆలయ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలి



సర్పవరం భావనారాయణ స్వామి ఆలయ నూతన పాలకవర్గంతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: నారద మహర్షి ప్రతిష్ఠించిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి పురాతన ప్రాశస్త్యం ఉందని, దర్శనాలకు వచ్చి భక్తుల పట్ల గౌరవంగా ఉంటూ వారికి మెరుగైన వసతుల కల్పనతో పాటు ఆలయ అభివృద్ధికి పాటు పడాలని నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సూచించారు. ఆలయ నూతన కార్యవర్గం వివరాలను ఈఓ విజయలక్ష్మి ప్రకటించారు. చైర్మన్‌గా పుల్ల నారాయణరావును పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. చైర్మన్, సభ్యులతో ఈఓ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని ఆలయ అభివృద్ధికి నిధులు కోరామన్నారు. ఈఓ విజయలక్ష్మి, సిబ్బంది, కురసాల కళ్యాణకృష్ణ, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, గ్రామ నాయకులు పుల్ల చందు, కోటేశ్వరరావు, ఎంపీటీసీలు గుత్తుల శ్రీనివాసరావు, సారా రాజేష్, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గం : ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పుల్ల నారాయణరావు, సభ్యులుగా లోలబట్టు శ్యామలదేవి, శీలం అప్పారావు, జోకా సత్తిబాబు, పుల్ల వీర వెంకట సత్యనారాయణ, పులగల మరిడమ్మ, గంటసాల బద్రీనారాయణ, వాసంశెట్టి వీరలక్ష్మి, పెద్దిరెడ్డి వెంకటాచార్యులు ఎన్నికయ్యారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- అరట్లకట్టలో గడప గడపకూ

కరప: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పథకాలు అమలు చేస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మనప్రభుత్వంలో భాగంగా ఆదివారం అరట్లకట్టలోని జగనన్న కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించి, ఎవరెవరికి ఎన్ని పథకాల ద్వారా లబ్ధి చేకూరిందో వివరించారు. జగనన్న, మీ దయతో సొంతిల్లు సమకూరిందని, జీవితాంతం మీకు రుణపడి ఉంటామని మహిళలు తమ సంతోషాన్ని, సంతృప్తిని వ్యక్తంచేశారు. డ్రెయిన్లు, రోడ్లు వేయించాలని కోరగా ఎమ్మెల్యే త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించి, గెలిపించాలని కోరారు. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, సర్పంచ్ గోపి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా కామేశ్వరి, తదితరులు ఎమ్మెల్యేతో ముందుకు సాగారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, నక్కా శ్రీనుబాబు, చోడిశెట్టి చంటి, పట్ల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.



అరట్లకట్టలో లబ్ధిదారుకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యవర్గం

కాకినాడ రూరల్: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా కాకినాడ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని రాయుడుపాలెంలోని బాబా సాహెబ్ సంక్షేమ సంఘం సామాజిక భవనంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాశి జానకి రాముడు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, ప్రధాన కార్యదర్శి మర్రి బాబ్జీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంచి జీవనానికి బౌద్ధం అలంబన అన్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఉపాసక గుత్తాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా నేలపూడి పెద్దిరాజు, కోశాధికారిగా పంతగడ రాంప్రసాద్, మరో 17మందిని కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. సమావేశంలో బాబా సాహెబ్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానికులకు అవకాశం కల్పించాలి

కాకినాడ సిటీ: స్థానిక పరిశ్రమలు, భవన నిర్మాణ, వ్యవసాయ రంగం, అన్ని రంగాల్లో స్థానికులకు పని అవకాశం కల్పించడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. ఆదివారం పీఆర్ భవనంలో ఏఐటీయూసీ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఏ పనుల్లో చూసినా తక్కువ వేతనానికి లభ్యమయ్యే ఇతర రాష్ట్రాల వారే కనిపిస్తున్నారని, ఎవరికీ కనీస వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. స్థానిక పరిశ్రమల్లో మహిళలను కూడా ఒరిస్సా, బీహార్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకుచ్చి తక్కువ వేతనంతో పని చేయిస్తున్నారని విమర్శించారు. దీని వల్ల స్థానికులు ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డైరీని ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు



వాక్‌థాన్ ప్రారంభిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, డీటీఓ మోహన్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖతో పాటు రవాణా శాఖ సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుందని ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆదివారం భానుగుడి నుంచి సర్పవరం జంక్షన్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. జిల్లా రవాణా శాఖాధికారి మోహన్ ఆధ్వర్యంలో ఆదిత్య విద్యార్థులు, మెడికవర్ వైద్య సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా రోడ్డు ప్రమదాల నివారణకు డ్రైవింగ్‌లో తీసుకోవలసిన అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. రవాణా అధికారి మోహన్ మాట్లాడుతూ ఈ నెల 24న ముగింపు ఉత్సవాల సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. వారోత్సవాలను విజయవంతం చేసిన అధికారులు, వాహన యూనియన్ సభ్యులను అభినందించారు. ఏంవీఐ మురళీకృష్ణ, హరినాథ్ రెడ్డి, లక్ష్మీకిరణ్, ఏఎంవీఐ చిన్నారావు, గౌరశంకర్, కళాజ్యోతి, షణ్ముఖశ్రీనివాస్ పాల్గొన్నారు.

గిడుగుకు ఘనంగా నివాళి



గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి వర్ధంతి నిర్వహించారు. సాహితీ వేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో సాగి అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. 1940 జనవరి 22న ఆయన కాలం చేశారని తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, పెండెం శ్రీదేవి, రేలంగి బాపిరాజు, సీహెచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తలారికి గిడుగు పురస్కారం

తిమ్మాపురం గ్రామానికి చెందిన గజల్ గాయకుడు తలారి ఆనంద్‌కు గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గిడుగు జాతీయ పురస్కారాన్ని అందజేశారు. గిడుగు వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమరయ్య హాలులో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. గిడుగు రామ్మూర్తిపంతులు ఫౌండేషన్ అధ్యక్షురాలు గిడుగు కాంతి కృష్ణ, శంకరం ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎలమర్తి ధనలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన తోప్పూర్ గాత్ర కచేరీ

కాకినాడ కల్చరల్: ప్రముఖ సంగీత విద్వాంసుడు తోప్పూర్ సాయిరామ్ గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. సంగీత విద్వత్సభ ఆధ్వర్యంలో స్థానిక సూర్యకళామందిర్‌లో రెండు రోజులుగా 75వ సంక్రాంతి వార్షికోత్సవాల పేరిట నిర్వహిస్తున్నారు. మోహనరాగంలో ' నను పాలింప...' పతువరాళి రాగంలో 'శంభో మహాదేవ...' తదితర కీర్తనలను సాయిరాం ఆలపించారు. మహదాసు శ్యాం నీలాద్రిరావు వయోలిన్, మహాదాసు ఏడుకొండలు మృదంగం, సరస్వతుల హనుమంతురావు ఘటంతో చక్కని సంగీత సహకారం అందజేశారు. తొలుత రాష్ట్రస్థాయి సంగీత గాత్ర వీణా వాద్య పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. సభాధ్యక్షుడు నారాయణం మురళి, కార్యదర్శి వక్కలంక రామకృష్ణ, ఆర్‌ఏ రావు, హిమబిందు, చావలి సూర్యకుమారి, ఎస్‌కేవీడీ వెంకట్రావు, మణిబాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.



కీర్తనలు ఆలపిస్తున్న తోప్పూర్ సాయిరామ్ తదితరులు

హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలి

కరప: డాక్టర్ అంబేడ్కర్ కల్పించిన హక్కుల సాధనకు ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా పోరాడాలని ఎస్సీ సంఘాలు పిలుపునిచ్చారు. స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో ఆదివారం దళిత రచయిత, బౌద్ధిస్ట్ సవిలే రాజేష్ అధ్యక్షతన 'ఎస్సీ, ఎస్టీ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలు, వాటికి న్యాయమైన పరిష్కార మార్గాలు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్సీల పట్ల వివక్ష చూపుతున్నారని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఎస్సీలకు జరుగుతున్న అన్యాయాలపై జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని తదితర 9 తీర్మానాలు చేశారు. దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమి అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ సభ్యులు మోకా పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మామిడితోటలో పూర్వ విద్యార్థుల సందడి



కరపలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల 1994-95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం స్థానిక రైతు తుమ్మలపల్లి రాము మామిడితోటలో సందడిచేశారు. కుటుంబ సమేతంగా వచ్చి నాటి ముచ్చట్లలో మునిగి తేలారు. అప్పటి అల్లర్లు, చెట్టాపట్టాలు గుర్తు చేసుకుంటూ, నేడు ఏంచేస్తున్నారు సమచారాన్ని ఇచ్చిపుచ్చుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట, పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఆ బ్యాచ్‌లోని తుమ్మలపల్లి మహేశ్వరరావు, కోలింక రాజా, వసంశెట్టి రాము, పేర్నిడి మూర్తి, అనిశెట్టి శ్రీను, సమనాసి గంగారావులు కృషి చేసి వారి స్నేహితుల సమాచారాన్ని సేకరించి ఈ కార్యక్రమానికి దోహదపడ్డారు.

భక్తాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

బోట్‌క్లబ్: లక్ష్యం ఎంత పెద్దదైనా సంకల్పంతో సాధించలేనిది లేదనడానికి రేచర్లపేట యూత్ నిదర్శనమని ప్రముఖ వ్యాపారవేత్త జ్యోతుల వెంకటేశ్వరరావు అన్నారు. రేచర్లపేటలో రూ.2 కోట్లతో పునర్నిర్మిస్తున్న భక్తాంజనేయ ఆలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ పునర్నిర్మాణంలో విశేష భూమిక పోషించిన పచ్చిపాల కోడిశ్రీను, ఆలయ కమిటీ అధ్యక్షుడు పులుగు భార్గవ్‌సాయి, కార్యదర్శి కొసిపల్లి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కారుమూరి వీరబాబు, ట్రెజరర్ మట్టపర్తి సత్యనారాయణ సేవలు మరువలేనివన్నారు. అనంతరం జ్యోతుల వేంకటేశ్వరరావును ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.



భక్తాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన వ్యాపారవేత్త జ్యోతుల వెంకటేశ్వరరావు

ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: నాడు-నేడుతో కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురంలో సీతారాంపురం 6వ వార్డులో ఉన్న విజయాంధ్ర మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో లేని విధంగా ముఖ్యమంత్రి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలనే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సైతం ఉన్నత స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించారన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు పాల్గొన్నారు.